ఇదీ ఒక పరీక్షే!

మంజుశ్రీ

శ్రీ పీతాంబరాచార్యులు ఎమ్. ఏ. ఎగ్జామినరుగా అనంతపురం వెళ్ళాడు. వెళుతుంటే కాస్తంత డాబు, కొంచెం టెక్కు అనిపించకపోలేదు మనసుకి. సుమారు పదిహేనేళ్ళ క్రితం కోటి వేల్పులకి మొక్కుకుంటూ తాను రాసిన పరీక్ష కిప్పుడు తానే పరీక్షకుడు కావడం — ఓహ్ తాను కల కన్నాడా అప్పుడు?

ఇప్పుడు అందరూ తనవైపే చూస్తున్నట్లనిపిస్తున్నది. 'ఈవేరా మన ఎగ్జామినర్' అని ఎట్లానో తెలుసుకున్నారు. దండాలు పెట్టేస్తున్నారు. చిరునవ్వుతో వాటిని స్వీకరించేస్తున్నాడు!

జీవితం ఎప్పుడూ ఊహల్లోనే బాగా వుంటుంది. అనుభవంలోకి వచ్చేసరికి ఆ ఊహ మాధుర్యం కాస్త కరిగిపోతుంది. కరిగిపోవడమే కాదు కాస్త కారం, కొంచెం ఉప్పు, కొద్దిగా చేదు కూడా తగులుతాయి.

ఏమీ డాబు లేదు, ఏమీ గొప్ప లేదు. చర్చించాల్సినవాళ్ళతో ఏదో చర్చించాననిపించాడు. ఇక్కడిక్కడ సంతకాలు పెట్టమంటే పెట్టేశాడు. డబ్బు జేబులో పడేసుకున్నాడు. ఇక వాట్ నెక్స్టు?

పీతాంబరాచార్యులుకి జ్ఞానినవుదామని చిన్నప్పుడు మహా తపనగా వుండేది. కాని ఏం లాభం? బి. ఏ. చదువుకుండే రోజుల్లో కలెక్టర్‌గారమ్మాయి రోజూ రెండుసార్లు కనిపిస్తే చాలు 'శ్రీ కైవల్య పదంబు చేరితిని నేనిప్పుడే' అనుకొనేవాడు.

ఆ అమ్మాయి తన క్లాసైతే ఎంతో బాగుండేది కదా క్రూరవిధీ అని బాధపడేవాడు. ఆ అమ్మాయిది తనకంటే ఒక్క క్లాసు తక్కువ. అయితేనేం రోజూ కనీసం రెండుసార్లైనా ఎక్కడోక్కడ దర్శించుకునేవాడు. ఏవేవో కలలు కనేవాడు. మనోరమ ముప్ఫై అయిదు డిగ్రీల విమ్ముకోణంలో తన వాలుగనులను (తెలుగంటే మహా పడిచచ్చేవాడు) అదో విలాసంగా పక్కకి మళ్ళించి పూలమాల వేస్తుంటే 'కాస్తంత తలన్నా వంచదేమమ్మా ఈ కొంటెకుర్రాడూ' అని అందంగా విసుక్కుంటున్నట్లు మనస్సులో బొమ్మలు గీసుకుంటూ ఉలికిపడుతుండేవాడు.

తర్వాత రోగం చప్పగా కుదిర్చారు తనని కన్నవాళ్ళూ, తన పెళ్ళాన్ని కన్నవాళ్ళూ కలిసి. పెళ్ళి చేసుకుంటేనే నీ మొహానికి ఎమ్. ఏ. గీత అన్నారు కన్నవాళ్ళు. విధిలేక తలవంచాడు. శకుంతల

అనే అమ్మాయిని పెళ్ళి చేసుకుని, ఆ తర్వాత దానికి కొన్నాళ్ళు వాయిదా వేసి చదువు వెలగబెట్టాడు.

జ్ఞాని కాలేకపోయినా ఈ లోకంలో తనచుట్టూ ఏం జరుగుతున్నది తెలుసుకోవాలన్న ఆత్రుత మాత్రం తగ్గలేదు ఆచారికి.

సాయంకాలం ఆరు గంటలకు పుట్టపర్తి పోయే బస్సు వున్నదట. ఎంక్వైరీ చేశాడు. ఎవరైనా తన వెంటవస్తే బావుండును అనే వుద్దేశాన్ని సున్నితంగా వ్యక్తపరుస్తూ...కాని కొందరు వింతగా చూశారు. కొందరు తమ అనంగీకారాన్ని వ్యంగ్యమైన నవ్వులతో తెలియ చేశారు. అంతేకాదు కొందరు 'ఇదేమిటి ఇంత వెనక పడిపోయిన భావాలు ఈ పీతాంబరాచారివి' అన్నట్లు చూశారు. దాంతో అతడికి వెళ్ళి చూసిరావాలన్న కోర్కె మరింత బలపడింది. ఎందుకీ వైరుధ్యం. నిజానికి రెండు వైపులెందుకు? సత్యానిది ఎప్పుడూ ఒక్కటే రూపు కదా !

పుట్టపర్తిలో అంతా ప్రదర్శన అన్నట్లు తమ ముఖాల్లో భావ ప్రకటనం చేస్తారెందుకు కొందరు? కొందరేమో పూర్తిగా తమని తాము అర్పించుకుంటారెందుకు? మనిషి జీవితంలో ఆధ్యాత్మికానుభవాలున్నాయో లేవో – అవి కేవలం భ్రమలేనేమో ! లేక ఏదో చైతన్యం, ఏదో జ్వాల, ఏదో పులకరింత, ఏదో విద్యుదావేశం ఒంట్లో పాకడం, మనస్సు ప్రశాంతి నందడం, ఇలాటి అనుభవాలున్నాయో లేవో! అమాయకులు, ఆర్తులు కేవలం ఎండమావిలో దప్పి తీర్చుకోవడానికి పరుగులెత్తడమేనేమో ! ఏది ఏమైనా అక్కడ చెడ్డ పనులేవీ జరగడం లేదుకదా. సమాజ విరుద్ధకార్యకలాపాలు జరగడం లేదుగదా ! అందరూ హాయిగా వుండండి. ఇలా ప్రవర్తిస్తే హాయిగా వుండగలుగుతారు. ఎవరినీ ద్వేషించవద్దు. అందరినీ ప్రేమించాలి – అనే కదా బాబాలు, మఠాలు, యోగులు, యోగినులు చెపుతున్నది. కాబట్టి వెళ్ళి చూస్తే తప్పులేదు. అధో జగత్తులోని భయంకర కార్యకలాపాలక్కడ వుండవు. ఈ దుర్మార్గాలను నిరసించడానికి కాని, తమచేతనైనంత ఎదుర్కోడానికి కాని, బట్టబయలు చేయడానికి పూనుకోవడంగాని చేయక, ఆధ్యాత్మికతని ప్రచారం చేసేవాళ్ళను డాంభికులని, మోసగాళ్ళని కొందరు దుష్ప్రచారం చేస్తారెందుకో –

అక్కడ జీవితం ఎలా వుంటుంది? అక్కడ చేరిన వాళ్ళందరూ ఎలా వుంటారు ? నిత్యకృత్యాలేమిటి ? ఇవి చూడాలని కుతూహలమైతే కలిగింది ఆచారికి.

ఆరు గంటలకి తాను చేరగలడో లేడో ! అని గుంజాటన పడ్డాడు. యూనివర్శిటీ కేంపస్ నుంచి ఊరికి దూరమే. ఎలానో చచ్చీచెడీ ఐదూయాభైకి బస్స్టాండ్ చేరుకున్నాడు. విచారణ దగ్గర విచారంగా అడిగితే వాళ్ళు సంతోషంగా బస్సు చెడిపోయింది, ఇంకో గంట లేటుగా బయలుదేరుతుందేమోనని చెప్పారు. అప్పుడే ఏదో ఆధ్యాత్మికానుభూతి ప్రారంభమైంది అనిపించింది పీతాంబరాచారికి. మేథమేటిక్సులో డాక్టరేట్ అయితే సంపాదించాడు కాని ఈ పరిణామానికి సమన్వయం కుదరలేదు. సరిగ్గా ఆరు గంటలకి బయలుదేరితే తాను అందుకోలేడని చెడిపోయిందా ! పొద్దున్న నాలుగు మెతుకులు తినీ తిననట్లు వున్నందువల్ల తను కడుపునిండా భోం చేయడానికి చెడిపోయిందా బస్సు ? తాను ఊళ్ళోకి వెళ్ళి భోంచేసి వస్తే ఈలోపున అరగంటలోనే బాగు పడిపోయి వెళ్ళిపోతుందా ? ఎవరిదైనా అదృశ్య హస్తం తన చేయి పట్టుకొని లాక్కొని వెళుతున్నదా ? చెడిపోయిన బస్సు గంటదాకా బాగు పడదంటున్నారు, ఒకవేళ అరగంటలోనే బాగై వెళ్ళిపోతుందేమో ! అప్పుడెలాగా, అని ఎంక్వైరీలో అడిగితే ఇంత అమాయకుడు ఇన్నాళ్ళకి మనకి దొరికాడని వాళ్ళు కడుపుబ్బనవ్వారు. చిన్నపుచ్చుకున్నాడు పీతాంబరాచారి. 'భోంచేసి రావచ్చా' అని అడిగాడు. 'మహాదర్జాగా భోంచేసి రండి' అన్నారు వాళ్ళు.

ఆకాశంలో రంగు రంగుల మబ్బులు. వాతావరణంలో సాయంకాలపు సంగీతం. పళ్ళు, పువ్వులు, పత్రికలు అమ్మేవాళ్ళ కేకలు, అరుపులు, దుమ్ము. దూరంగా రైలు కూత హడావుడి. ప్రతిరోజూ ఇదే దృశ్యం, ఇదే ధోరణి. చెట్లమీద పక్షులు కోలాహలంగా రోజూ చేరేచోటే అయినా వెతుక్కుంటున్నాయి.

వాళ్ళనీ, వీళ్ళనీ అడిగి దగ్గర హోటల్‌కి చేరుకున్నాడు. రెండు చపాతీలు తిన్నాడు. పాలు దొరుకుతాయంటే పాలు తాగాడు. బయటికి వచ్చి రెండు అరటిపళ్ళు తిన్నాడు. మీఠాకిళ్ళీ వేసి సిగరెట్ ముట్టించాడు. 'మగ పుట్టుకయే కదా మధురం, అహా ధన్యం, ఓహో అందం' అని పాడాలనిపించింది. ఉన్న ఊళ్ళో చొరవగా సిగరెట్లు తాగడు పీతాంబరాచారి. భయం కాదుకాని అదో సంకోచం. మేష్టారు సిగరెట్టు కూడా కాల్చరు; ఇక తక్కినవా ? !? తప్పు తప్పు అని కుర్రాళ్ళు అనుకోవాలని బోలెడు సరదా శ్రీమాన్ ఆచార్ల వారికి. పెళ్ళానికి కూడా సిగరెట్ పడదని కొంచెం భయమే. నిజం చెప్పొద్దూ! ఆమె పుట్టింటికెళ్ళినప్పుడు ఇంట్లో అతి రహస్యంగా త్వర త్వరగా దమ్ములు పీల్చడం సంగతి అలా వుంచి.

ఏడూ ఇరవైకి బయలుదేరింది బస్సు. ఎన్నింటికిచేరుతుంది అక్కడికి? అని ఎవరినో అడిగితే పదిన్నరకి పైమాటే అన్నారు. కాస్త మనస్సు బరువెక్కింది. గడచిన రాత్రి నిద్రలేదు. అది కొత్త చోటు. గది దొరుకుతుందో లేదో, ఎప్పుడూ ఒకటే రష్షట కదా ! ఎందుకీ ప్రయాణం పెట్టుకున్నానా అనిపించింది.

రొప్పుతూ రోజుతూ, ఒగరుస్తూ, ఆయాస పడిపోతూ, కొప్పు విడిపోయి బుజాలమీదికి జారిపోతుండగా, కొంగు జారిపోతుండగా ఒక చిన్న వయస్సు ఆడకూతురు "అన్నా అన్నా ఆపండి ఆపండి, ఒక్క చెనం. ఒక్క మినిట్టు" అంటూ వచ్చిపడింది, పుట్టపర్తి బస్సే గదా అన్నా అంటూ. బస్సు ఆగింది. మరి ఆమె ఎక్కలేదు.

ప్రయాణీకులు ఎక్కే ద్వారంలో ఆమె తెచ్చిన పెట్టె పట్టేట్లు లేదు. పైకి ఎక్కించే లైసెన్స్ కూలీలెవ్వరూ అక్కడ లేరు. ఆ పెట్టె తానే ఎత్తబోయింది. చేతకాలేదు. ఇంతలో రిక్షా అతను పేచీ పెట్టుకున్నాడు. తనదగ్గర చిల్లరలేదు. రెండు రూపాయలు ఇచ్చేయ్యమంటున్నాడు.

"ఏం ఆడకూతురిని చూస్తే అలుసా ! రూపాయికి ఒప్పుకొని రెండు రూపాయలిమ్మంటావా ? ఇది నీకు న్యాయమా ! చూడండి బాబూ మీరైనా చెప్పండి !" అని వాళ్ళ మొహంలోకి వీళ్ళ మొహంలోకి చూసింది. కుదురైన మొహం. చక్రాల్లాంటి కళ్ళు. అందమైన వయసు. కాకపోతే అద్దంమీద దుమ్ము కొట్టుకున్నట్లున్నది. డ్రైవర్ మూడుసార్లు స్టార్ట్ చేశాడు. కండక్టర్ రెండుసార్లు విజిలిచ్చాడు.

"రేప్పొద్దున రావమ్మా. అసలే మేం చస్తుంటే లేట్టైపోయి, నీదో బాగోతమా" అని కండక్టర్ విసుక్కుంటున్నాడు.

"నా తండ్రి నా తండ్రి న్యాయున్నాయన వొంటరి ఆడకూతురిని న్యాయం గాదు, షిరిడి నుంచి వొస్తన్నా ఈ రాత్రి ఏడుండను ఈ బస్సుట్నాండు కాడ. అక్కడికెళ్లిపోతే మరి సిక్కులేదు" అని బతిమాలుతోంది.

కండక్టర్ మెత్తబడ్డాడు. నాకాడ కూడా అర్ధరూపాయి లేదే – ఆ రిచ్చామడిసిని ముందు పంపించు. ఆ పెట్టె సంగతి నే జూసుకుంటాను అన్నాడు. ఒకళ్ళవేపు ఒకరు చూసి విసుక్కునేవాళ్ళే కాని చిల్లర ఇచ్చి ఆ చిక్కు విప్పుదామని ఎవరూ అనుకోరు.

పీతాంబరాచార్యులు అర్ధరూపాయి బిళ్ళ ఇచ్చి రిక్షా అతనికి ఇవ్వమన్నాడు. రిక్షా అతను కోపంతో అర్ధరూపాయి తీసుకొని పెట్టె లోపలికి ఎత్తడంలో ఒక్క చెయ్యికూడా అందించకుండా వెళ్ళిపోయినాడు. లోపలివచ్చికూర్చుందా అమ్మాయి.

"ఏం తల్లీ బోషాణం ఎంటబెట్టుకొచ్చావు ? ! ఇంతకన్నా చిన్నపెట్టె దొరకలేదా ? సంసారమంతా ఎంటబెట్టుకొచ్చినట్లున్నది" అని చెమట తుడుచుకున్నాడు కండక్టరు. ఆ అమ్మాయి కిసుక్కున నవ్వింది.

దీపం తీస్తే కాంతి పోతుంది కాని, ఈ నవ్వు అలాటిదికాదు. తర్వాతకూడా చాలాసేపుకనపడుతుంది అనిపించింది పీతాంబరాచారికి. మనసులో ఏవిటో ఆనందరేఖ మెరిసింది. 'ఇంకా నయం నా మొగుణ్ణి కూడా అందులో పెట్టుకొచ్చానన్నావు కాదు' అంటూ చిన్నగా చిలిపిగా నవ్వింది. కండక్టర్ భళ్ళున నవ్వాడు.

"అమ్మగారిని ఏడనో చూసినట్లుందే" అన్నాడు.

"రెండేళ్ళకి, మూడేళ్ళకి ఓసారి ఇట్లా ఒస్తానే వుంటా – పుట్టపర్తి. ఈసారే నాలుగేళ్ళయి పోయింది. కిందటి నెల్లో బయలుదేరాను. ముందు షిరిడీ పోయినాను" అని సోది మొదలెట్టింది. కండక్టర్ టికెట్లు చూడటానికి లోపలికి వెళ్ళడంతో మాటలాపేసింది.

"చూశారా బాబుగారూ, ఒంటరిదాన్ని ఆడకూతుర్ని చూస్తే ఎవరికైనా అలుసే – భయం లేదు. ఎంత పేచీపెట్టాడు. ముదనష్టపోడు" అని పీతాంబరంవైపు తిరిగింది ముందు సీటులోంచి వెనక్కు.

అప్పుడు స్పష్టంగా చూశాడు, కళ్ళలోకాంతి. అందమైన పలువరుస.

"ఎక్కడినుంచి వస్తున్నారు ?" అని అడిగాడు ఆచారి.

ఇదివరలోనే బాగా పరిచయమైపోయి బి.ఏ.లో తన క్లాస్‌మేట్ ఏమోనన్నంత అభిమానంగా. పూర్తిగా ఇటువైపు తిరిగిపోయింది ఆ అమ్మాయి. ఆ సీట్లో ఇంకెవ్వరూ లేరు. అదీ స్వారాజ్యం.

"షిరిడీ నుంచి వస్తున్నాను బాబుగారూ. మీరెప్పుడైనా షిరిడీ వెళ్ళారా ? ఎల్లకపోతే ఎళ్ళి చూసిరాండి. మీకు తప్పక మనసులో అనుకున్నది జరిగితీరుద్ది."

పీతాంబరాచారి కొంచెం ముందుకి జరిగాడు పరిచయంతో. "అయితే మీరనుకున్నది జరిగిందా ?"

ఎందుకడిగానా అనుకున్నాడు మసక కాంతిలో ఆ పిల్ల పెదవులు ముడుచుకున్నాయి. ఏవిటో నిస్సహాయత కళ్ళలో కదలాడింది. 'బాబుగారూ ! మీ డబ్బులు ధర్మారంలో ఇచ్చేస్తాను. అక్కడే వో రెండు అరటిపళ్ళు కొనుక్కుంటానులెండి. ఇక ఈ పూటకి మనకి అన్నం లేదు. ఆడ గేటుకూడా మూసేస్తారు. ఆ మేనేజర్ నాకు తెలుసులెండి. ఓపాలి ఏమైందనుకున్నారు ? పెద్ద జగడమైపోయింది. నన్ను ఆడాళ్ళ చావిడికి పంపించాలని ఎంతో గింజుకున్నాడు. నేనేమో పోనంటాను. పెద్ద గోల. మీకు తెలీదు బాబు ఆ చావడిలో బతికనియ్యరు.'

పీతాంబరాచారికి భయమేసింది. కుతూహలమూ కలిగింది. ఇదేమిటి ? ఇక్కడకూడా పోట్లాటలూ కొట్లాటలూనా –

'మీ పేరేవిటండీ' అని అడిగాడు పీతాంబరాచారి.

"నా పేరు సర్వతవర్ధని అయ్యా. నాకు పలకటం కూడా సరిగా రాదు. నేనేమీ చదువుకోలేదండీ. స్కూలు ఫైనల్‌దాకానైనా చదువు చెప్పించమని నేనెంతో పోరానండీ అయ్యగారూ – మా అయ్యా అమ్మా వైరిబాగులోళ్ళండీ. పూజలు దేవుళ్ళూ ఇయ్యేనండి వాళ్ళకు. చదువు చంద్యా అక్కర్లేదండీ. నాకు పదిహేనేళ్ళున్నా నిండకుండా పెళ్ళి చేశారండీ. అళ్ళకి లక్షలున్నాయనీ, అరవై యకరాల మాగిబుందనీ, లారీ వ్యాపారమనీ, చిన్నప్పుడే ఇచ్చి చేశారండీ."

'ఇకనేం మరి.' అన్నాడు పీతాంబరాచారి ఊరుకోలేక.

"మీరుకూడా అట్టా అంటారేటండయ్యా. బతుక్కి సుకం, మంచీ చెడ్డా లేకపోయినకాడికి అయన్నీ ఎందుకండీ." అని గిరుక్కున అటువేపు తిరిగింది.

పీతాంబరాచారికి ఆ పిల్ల మెడ, మెడపైని అందమైన జుట్టు, కాస్త ముందుకి వంగినప్పుడు వీపూ కనపడుతున్నాయి. మనసులో ఏవిటేవిటో ఊహలు కదులుతున్నాయి. మొగుడిమీద బాగా ద్వేషం లాగుంది ఈ అమ్మాయికి. అతడి ఊసెత్తితేనే ఇలా అయిపోతోంది. ఇదివరలో చాలాసార్లు వచ్చాను పుట్టపర్తి అంటున్నది ఈ రాత్రికి ఈవిడున్న చోటే తానుండిపోతే – ఛీఛీ ఛాఛా తూతూ ధూధూ అంటున్నారెవరో మనసులో. అసంకల్పిత చర్యా పరంపర.

ఇంతలో మళ్ళీ వెనక్కు తిరిగింది ఆ అమ్మాయి.

ఇదీ ఒక పరీక్షే !

తన పేరుకూడా తనకు పలకడం రాదంటున్న ముద్దరాలు.

"మీకేం ఉద్యోగమండీ – ?"

"ప్రొఫెసరంటారులే. ఎమ్. ఏ. చదివే పిల్లలకి పాఠాలు చెపుతాను."

మొహమంతా కళ్ళే అయిపోయినవి వర్ధనికి.

"బాబుగారు ! మీరు నాకు సాయం చేస్తానంటే మా బాబుని తీసుకొని మీయెంట ఒస్తానండీ. ఆడ అస్టలున్న మంచి స్కూల్లో చేర్పించాలి. మీకు పెద్దపెద్దోళ్ళెందరో తెలిసుంటారు. దిక్కులేని దానికా మాత్రం సాయం చెయ్యండి బాబయ్యా. నా దగ్గరింకా ముప్పైరెండు కాసులున్నాయి. నా బాబు పెద్దసదువులు సదవాలి. బుద్దిమంతుడు కావాలి."

(పీతాంబరాచారికి హాయి హాయి అనిపించబోయి, జావ జావగారిపోతున్నట్లనిపించింది.)

'ఈ రాత్రి మనమెక్కడుండాలి' అని అడిగాడు.

'ఓహ్ జాగా దొరుకుద్దిలెండి. మీరేం దిగులు పడకండి. నేను గట్టిగా నోరు చేసుకుంటాను. అంతగా సత్రంలో దొరక్కపోతే గది ఇమ్మని అడుగుదాం.'

(నిజంగా ! అంత అదృష్టమా !)

"బాబా, నేనోటి చెపుతాను. మీరేమీ అనుకోకండి. మీరూ, మేమూ ఒక కులం వోళ్ళంగాము. కాకపోతేనేం, నేను సుబ్బరంగా చేస్తాను వంట. నాలుగింటికల్లా లేచి రోజా తలారా స్నానం చేస్తాను. నలభై ప్రదక్షిణాలు చేస్తాను. నా దగ్గర పప్పూ, ఉప్పూ, బియ్యం అన్నీ ఉన్నాయి. రెండు మామిడి కాయలు కూడా వున్నాయి. పొద్దున్నే వంటచేస్తాను. మీరు భోంచేద్దురుగాని."

(పీతాంబరాచారి మనోమోహకంగా ఆలోచనల్లో బడిపోతున్నాడు. తేలియాడుతున్నాడు. ఓహో నా బాగ్యమే బాగ్యమూ...పాడుగ్గా నేవళంగా అందంగా ఆ ఒళ్ళూ, పొందికైన ఆ పెదవులు ... ఇక ఆలోచించలేకపోతున్నాడు.)

ఇంతకూ మీ వారి పేరు చెప్పావు కాదు – అన్నాడు చనువు తీసుకొని.

"పేరుకేం బాగ్గెం లెండి. పేరైతే దయానందం అని పెట్టారు. బాగానే వుంది. బుద్దో, బుద్ధితక్కువోడు. ఎప్పుడూ సీట్లపేక. డింకే డింకు. ఒకటే డింకు. లారీ అమ్మేశాడా ! తన వంతు మాగిలిపోయిందా. మెడికల్ సాప్‌పెట్టి దాన్ని పాడుసేసుకున్నాడా ! ఇప్పుడు తాడేపల్లిగూడెంలో సినిమాహాలు కడతాడట. నా కాసులిమ్మంటాడు.

రచయితలకి మనవి

★ కాగితానికి ఒక వైపునే సిరాతో రచనలు వ్రాసి పంపవలసిందని అన్నిరకాల రచనలు పంపే రచయితలకి మరోసారి మనవి చేస్తున్నాము.

★ గేయాలు, కార్టూన్‌లు చాలా యెక్కువ సంఖ్యలో మా కార్యాలయం చేరుతూంటాయి కనుక వీటి పరిశీలన వెన్వెంటనే జరుగదు. — సం॥

నాకు పుట్టింటివాళ్ళు ఐదెకరాలు పసుపూ కుంకుం ఇచ్చారులెండి. అదీ ఇయ్యాలట. చూడండి అయ్యగారూ ! నాకో బిడ్డా, ఓ కొడుకూ ఉన్నారుకదా – ఆళ్ళేమైపోవాలండీ – బాబ్బాబు మీరు పెద్దోళ్ళు, మా బాబుని మంచి ఆట్టళ్ళో పెట్టిబాగా చదివేలా చూడండి. నా కూతుర్ని ఏలూర్లో కిస్టియన్ స్కూల్లో పెట్టా. బాబుని బెజవాడలో మిషన్ స్కూల్లోచేర్పించా. కాసులిచ్చిందాకా తనతో కాపురం చెయ్యొద్దట. ఓపాలి ఇట్టాగే ఎల్లగొట్టేండు. అప్పుడు పుట్టపర్తి వచ్చేసినా ! మళ్ళీ రెన్నెళ్ళకు వచ్చి బతిమాలి తీసుకొనిపోయిండు. ఇప్పుడుకూడా వచ్చివున్నాడేమో ఆడ."

(పీతాంబరాచారికి దడపుట్టింది.)

ధర్మవరం వచ్చింది. చెంగున బస్సు దిగి పోయింది పర్వతవర్ధని.

పీతాంబరాచారికి దుఃఖం వచ్చింది. అన్నా ఏమన్యాయం. ఇందాకటినుంచీ తన మనసులో పాములు, నక్కలు, పెద్దపులులు, ఎలుగుబంట్లు, జెర్రులు ఇంకా అసహ్యమైన క్రూరమృగాలు. ఏమిటిదంతా ? కొంచెం చనువుగా మాట్లాడిందనీ, తన కష్టసుఖాలు చెప్పుకుందనీ, గోడు వెళ్ళబోసుకుందనీనా ?

నవ్వుమొహంతో తిరిగివచ్చి ఒక యాపిల్ ముక్క, రెండు అరటిపళ్ళూ, సగంచెక్క బత్తాయి తొనలూ, అర్ధరూపాయి బలవంతాన చేతిలో పెట్టేసింది. వద్దంటే జబర్దస్తీగా చేయి పుచ్చుకొని లాగి చేతిలో పెట్టేట్లున్నది.

అవి తినబుద్ధి పుట్టలేదు పీతాంబరాచారికి.

తినమని బలవంతం పెడుతోంది. బస్సు కదిలింది. అప్పటికే తొమ్మిది దాటింది. మౌనంగా వుండిపోయిందా అమ్మాయి.

పీతాంబరాచారికి మనస్సంతా శూన్యమైపోయింది. చాలా అసహ్యమేస్తున్నది తనపైన తనకే. చప్పున ఒక విషయం జ్ఞప్తికి వచ్చింది. తాను ఎంతో ప్రేమించే ఎంతో గౌరవించే ఒక స్నేహితుడు చెప్పిన విషయం. కటక్‌లో తాను రిసెర్చి చేస్తున్న రోజుల్లో తెలుగు మిత్రుడే విశ్వనాథం పంతులు చెప్పిన విషయం. మనసుని అదుపులో వుంచడానికి చేయవలసిన ప్రయత్నాల గురించిన ప్రస్తావన. విశ్వనాథం అన్నాడు – నీవు ఎప్పుడైనా గుడికి వెళ్ళినప్పుడు అక్కడ అమ్మవారి ముందు నిలుచుంటావు చూడూ. అప్పుడెలాగ వుంటుంది నీ మనస్సు ? నేనోసారి మధురలో మీనాక్షి తల్లి ముందు నిలుచున్నాను. ఈ త్రిలోకీ శుకీ పంజర ఆమె. ఆ తల్లి పెదవులపై దయ. విశ్వసమ్మోహనమైన హాసం. ఆ వయ్యారపు భంగిమలో భుజంమీద విలాస శంకం. ఎందుకు చెపుతున్నానో తెలుసా ? నీ కంటికి చాలా అందమైన యువ్వనవతి, లేదా స్త్రీ కనిపించిందనుకో, ఆ చోటే దేవాలయమని మనసులోనే ఆత్మ ప్రదక్షిణ నమస్కారం చేసెయ్. నీ మనసులో చెడు తలపులు రానేరావు.

పుట్టపర్తి వచ్చేసింది. అందరూ దిగారు బస్సు.

'అన్నా ! కాస్త ఈ పెట్టె సాయం పట్టవా ?' ఉలిక్కిపడ్డాడు పీతాంబరాచారి. నవ్వు వచ్చింది. మనసులో ఆనందరేఖ మెరిసింది. ★